# దొంగా దొరా ఎవరికి వారే



అది అక్టోబరు నెల చివరి వారం.

పొలాలలో వరి శక్తి పుంజుకుని ఏపుగా పెరగ నారంభించిన కాలం. చెరుకు వెన్ను విగారింపుకి రానున్న కాలం. చలి ప్రారంభానికి నాంది. వెండి వెన్నెల తళతళ లాడటానికి అనువైన కాలం. అరటి పువ్వులు తోటల్లో తుమ్మెదల నాహ్వానించే కాలం. వానలు ఎడబెట్టిన కారణం చేత తోటల్లోని కొబ్బరి కాయలు విరివిగా రవాణా ప్రారంభించిన కాలం. మహేంద్రగిరి మేఘాలు లేవిడై నీలంగా, అందంగా మెరిసే కాలం. మహేంద్ర తనయ నీరు తేటపడి స్వచ్ఛమై మందంగా ప్రవహించే కాలం. ఆ సమయంలో అనుకోని విధంగా జరిగిం దొకటి.

రేడియో ఏదో చెప్పిందట.

ఎక్కువ మంది ఎవరూ వినలేదు. సారథీ వినలేదు.

రైతుల ఆశలు తెగి పడ్డాయి.

ఆ రోజు ఉదయం నుండి ఆకాశం మబ్బుగా ఉంది. సాయంత్ర మయ్యేసరికి సన్నని వాన ప్రారంభమైంది. ఈదురుగాలి వీయ నారంభించింది. సముద్రపు ఒడ్డుకు షికారుకి వెళ్ళిన సారథి తడిసి తిరిగి వచ్చాడు. దూరంగా ఉన్నా స్పష్టంగా కనిపించే మహేంద్ర గిరి కనిపించటం మానేసింది. పొగ మంచులా మేఘా లావరించాయి. వెంకయ్యనాయుడి గారి కొబ్బరి తోటలో కొబ్బరిచెట్లు, కూర్మయ్య గారి తోటల్లోని అరటిచెట్లు గాలికి వూగటం ప్రారంభించాయి.

ఆ వూరింటిలో సీతమ్మగారు వడ్డన చేస్తూ "తుఫాను గాని పెట్టదు కదా?" అన్నారు.

"ఆ. ఆ! తుఫానంటే జ్ఞాపకం వచ్చింది. మన మలేరియా ఇన్‌స్పెక్టరు పోలయ్య ఇడ్డీదగ్గర అంటూంటే విన్నాను—బంగాళాఖాతంలోట..." అని పోసల్‌స్టడీస్ మాస్టరేదో ఆపేంతలో అతను రావే వచ్చాడు ట్రాన్సిస్టరుతో.

"ఏమిటండీ—బంగాళాఖాతంలో?" అడిగా రెవరో అతనిని.

"అవునండీ! బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందట. విశాఖ పట్నానికి 200 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందట. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వాయువ్య దిశగా ప్రయాణం చేస్తూ వస్తున్నాయట. వేగం ఇంకా ఎక్కువ కావచ్చట. వచ్చే రెండు రోజుల్లో తీర ప్రాంతానికి తుఫాను పెట్టవచ్చునని హెచ్చరిక" అంటూ ముగించా డతను,తనకు గుర్తున్నంత వరకు చెపుతూ.

"అ—తుఫానే. ఆ గాలిని విన్నారు కాదూ?" తుఫాను స్వరూపాన్ని నిర్ధారిస్తూ అన్నారు తెలుగు మాస్టారు.

"సముద్రం హోరుకూడానూ." అలకిస్తూ అన్నాడు కొబ్బరికాయల గుమాస్తా జోగినాధం.

"పులుసు వెయ్యి, మావమ్మా!" హెచ్చరించాడు హెల్తు సెంటరు కాంపౌండరు, మర్నాడు తుఫాను ఉంటే భోజన మెలాగ అనే బెంగతో.

తుఫాను అనగానే తన వూరిల్లు ఏమవుతుందో, మరునాడు వలుగురికి భోజనం ఏ విధంగా తావమర్చ గలదో అనే బాధతో పులుసు గిన్నె వందుకున్నారు సీతమ్మగారు. అదే భయం అక్కడున్న అందరిలోనూ ఉంది.

ఉద్యోగరీత్యా ఆ వూరు చేరిన వారందరికి సీతమ్మగారి భోజనం హోటలు ఒక వరం. చిమ్మ చీకటిలో చిరు దీపం లాంటిది. కాలే కడుపుకి మండే బూడిదను పోసేవి హోటళ్ళు. సీతమ్మగా రలా కాదు. రుచికరమైన భోజనం వండి పెడుతుం దామె. వయసు మీదబడి జవసత్వాలు తగ్గిపోతున్నా, ఓపిక పడి ందరి కడుపులూ నింపుతుంది. ఎంత రాత్రి అయినా, ఏ జాతి వాడికైనా అక్కడ ప్రవేశానికి అడ్డంకి ఉండదు. ఆ హోటలులో ప్రతి దినము భోజనం చేసేది ఒక అరడజను మంది. అందులో సారథి, హెల్తు సెంటరు కాంపౌండర్, మలేరియా డిపార్టుమెంటులో ఇన్‌స్పెక్టర్ జోగినాధం ముఖ్యులు. అయినా, పగటి పూట పది పదిహేను విస్తళ్ళకు తగ్గవు. కొబ్బరికాయలకు, జీడిపిక్కలకు ఎవరో ఒకరు వచ్చి పోతూనే ఉంటారు. ఆర్థికంగా, రాజకీయంగా పరపతి ఉన్న వారందరూ ఆమెకు పరిచయస్థులే. వారెప్పుడో ఒకప్పుడు ఆమె చేతి భోజనం రుచి చూచిన వారే. ఎవరైనా బుద్ధిగా తల వంచుకుని భోజనం చేయవలసిందే.

". .. అన్నం మరి కొద్దిగా వేయించుకో. మరి అలా తింటే ఎలాగ? గుంటూరు గోంగూర పచ్చడి. తమాషా అనుకున్నా వేమిటి? వెల్లుల్లి పాయలతో ఎంత బాగుందనుకున్నావ్? మరి కొద్దిగా అన్నం కలుపు. ఒరేయ్ జోగినాధం! ఇవ్వాళ మజ్జిగలో కొద్దిగ గంగాభవానీ కలిసింది కాని, కాస్త వాయు

**ఊర్వశి**

తగ్గించు. రేపు మొత్తం పట్టద్దువు గాని." నాలుగు రకాలుగా హెచ్చరిస్తూ తిండిపెట్టే ఆమె ఆప్యాయత నెవరూ మరిచిపోలేరు. ఆ ఆప్యాయత కెవరూ విలువ కట్టలేరు. శాంత అనే అమ్మాయిని చేరదీసి పెళ్ళి చేసి పంపిం దామె.

"ఒరేయ్! నీ పెడవైతే నా కేం కాని, భోజనం డబ్బులు మాత్రం పంపించు. ఆ—దయకేం.గుమ్మం మీద పెట్టిపో."

లాభా లక్కర లేదామెకు. సుఖాలూ అక్కరలేదు. వూరి వారి కష్టాలన్నీ ఆమెవే. వూరి వారి సమస్యలు అన్నీ ఆమెవే. ఆ వూరికి పెద్ద దిక్కామె. వారం వర్జ్యం ఆమె చెప్పాలి. మంచీ చెడూ ఆమె చెప్పాలి. బిడ్డడిని ఎప్పుడు గడప దాటించ వచ్చో, బాలింతని ఎప్పుడు పురిటికి తీసుకు వెళ్ళవచ్చో, అరసవెల్లి సూర్యనారాయణమూర్తికి ఏమేమి ప్రీతి కరమో ఏ దినములలో దర్శనం మంచిదో, సత్యనారాయణ వ్రతం ఎప్పుడుచేసుకోవచ్చో...వూరిలోవారికితెలిసినా, ఆమె చేత తీర్థాన్ని శంఖంలో పోయించాలి. ఆమె నందరూ 'మావమ్మ' అంటారు.

ఆవిడ తిట్టినా ఎవరికీ బాధ అనిపించదు.

ఆమె కెవరూ లేరు. అందుచేతనే వూరంతా ఆమెది. శాంత నలానే పెంచింది.

సొలువు గాలి వీయ నారంభించింది. సన్నని వర్షం తుప్పర్లుగా పడసాగింది. పులుసు ఎడ్డిస్తున్న మావమ్మ కళ్ళలో భయం ద్యోతకం కాసాగింది. భోజనాలు అయిన తరవాత కష్ట సుఖాలు చెప్పుకునేందుకు మావమ్మ హోటలు అరుగు మీదికి చేరిన వారంతా లోపలికి వరకాయించారు. అన్నం మాత్రం వండుకుని కూరకు, పచ్చడికి, మజ్జిగకు మావమ్మమీద ఆధారపడిన వాళ్ళు ద్వారానికి అతుక్కుని నిలబడ్డారు. జోగినాధం ముందున్న దీపం బుడ్డి ప్రాణం కిరకిర లాడింది.

"తలుపు వెయ్యి, మావమ్మా!" అన్నాడు జోగినాధం.

గాలి బొప్పాయి గొట్టాల్లోంచి వూదసాగింది. మావమ్మ నేతి గిన్నెను పక్కకు జరిపి ద్వారం వైపు చూచింది. చేతుల్లో గిన్నెలు పట్టుకుని నిలబడ్డారు ఆ వీధిలోని ఇద్దరు పిల్లలు. అల్లం వేసిన వంకాయ ముద్ద కాస్త చెరో గిన్నెలో వేసి తలుపు కొద్దిగా చేరవేసింది మావమ్మ. ఆమె మనసంతా అల్లకల్లోలంగా ఉంది.

ఎవరూ మాటాడటం లేదు. గాలి, వాన వల్ల నాలుగు విస్తళ్ళు తప్ప మరేమీ లేవు. "ఈ గాలి, వానా పంటకు దెబ్బే!" అన్నాడు ఎలిమెంటరీ స్కూలు మాస్టరు వెంకన్నపంతులు.

"కాదు మరి! అమావాస్య నాటి గాలి, వాన" అన్నాడు కాంపౌండరు.

"గాలి, వానా అయితే కాస్త నెరవ. ఇది తుఫానులా లేదూ?" సాగదీశాడు వి. ఎల్. డబ్ల్యు. అప్పుడప్పుడు అక్కడ విస్తరి వేస్తూంటా డతడు. మావమ్మ మౌనంగా వడ్డన సాగిస్తూంది.

ఈ విధంగా అక్కడ సమావేశమయ్యే ఈ సభలో పెద్ద లోపం మాత్రం ఒకటి ఉంది. అది నూకాలు అక్కడ లేకపోవటం. నూకాలు ఆ గ్రామానికి గూర్ఖా లాంటివాడు. వాడు ప్రతి రోజూ జరిగే సమావేశానికి హాజరవుతాడు. గడప అవతలే నిలబడతాడు. గడప దాటి లోపలికి రాడు. కాని, వాడికి ప్రపంచమంతా తెలియాలి. వాడుంటే ఏ దొంగా గ్రామంలో అడుగు పెట్టలేడు. ఒకవేళ ఎవరైనా తెలియక చేస్తే నూకాలు చేత చావు దెబ్బలు తప్పించుకోలేరు. వాడికి నచ్చిన విషయముంటే "మా బాగ సెప్పారు, బాబూ!" అంటాడు.

"నూకాలు లేకపోవటం లోపమే!" అన్నారు తెలుగు మాస్టారు.

"కాదుమరి!వాడుపడుపుకోకపోయినానూకాలు ఎంత బాగా అర్థం చేసుకుంటాడని!" అన్నాడు కాంపౌండరు.

"ఎక్కడున్నాడో? ఏమిటో?" విచారించాడు వెంకన్న పంతులు.

"ఇంకెక్కడుంటాడు? వూరు విడిచి వీడెక్కడ పారిపోయి ఉంటాడు." వి. ఎల్. డబ్ల్యు. కలుగ జేసుకున్నాడు.

"ఎక్కడికని పోతాడు? ఎంత దూరం పోతాడు? సీతాపతి వాడిని పట్టి తీరుతాడట. పంతం పట్టాడు. సీతాపతి తలుచుకుంటే ప్రాణం తీసినా తీస్తాడు" ఎవరో అన్నారు.

'మా బాగ సెప్పారు బాబూ' అన్నా రెవరో నూకాల్ని అనుకరిస్తూ.

అందరి భోజనాలూ అయినాయి. గాలి వీస్తూనే ఉంది. వాన పడుతూనే ఉంది. దూరాన ఉన్న సముద్రం పెరట్లోకి వచ్చినంత దగ్గరగా హోరు మంటూంది. వాన పెద్దదయ్యే సూచనలే కనిపిస్తున్నాయి. ఇక ఎక్కువ కాలం ఉండటం

# జలుబులు, ఫ్లూను గూర్చిన ముఖ్య విషయాలు మరియు ఈ వ్యాధులను ఎదుర్కొను విధములు



"జలుబు, ఫ్లూ వల్ల వచ్చే బాధలనుంచి వెంటనే ఉపశమనం ఇవ్వడంలో అనాసిన్ ఎంతో సహాయపడుతుంది" అంటున్నారు నటాలియా ఉసోవా.

### ఏటివలన జలుబులు ఫ్లూ వస్తాయి?

జలుబులు, ఫ్లూగల మనుష్యుల నుండి గాలిలో కానిపోలేదు విషపు సీటి (వైరస్) తుంపరుల వలన జలుబులు, ఫ్లూ వస్తాయి. మామూలుగా ఈ వైరస్‌లను ఎదిరించు శక్తి మీ శరీరమునకు ఉన్నది. అయితే, అతి ప్రయాన లేక పోషణ లోపము వలన మీ శరీరము బలహీనమై, రోగములు అర్థుకొనే దాని శక్తి తగ్గి పోతుంది.

### వాటి లక్షణాలు ఏమిటి?

తలబారము, తలనొప్పి, కారెడు ముక్కుతో జలుబు ఆరంభిస్తుంది, వణకుట, బాధ మరియు చెమట పోయుట, సాధారణంగా ఫ్లూతో వస్తాయి. దగ్గు, గొంతునొప్పి, ఒడలంతా నొప్పులు, ఆకలి లేమి మరియు అలుపు కూడ ఉండవచ్చును.

### అది చిక్కులను దారి తీయవచ్చునా?

వెంటనే నివారించకపోతే ఫ్లూ, న్యుమోనియా మరియు శ్వాస మార్గము పైభాగములో రోగ సంక్రమణకు దారి తీయవచ్చును.

### అనాసిన్ ఎలా సహాయ పడుతుంది?

అనాసిన్ జలుబులు మరియు ఫ్లూ బాధల నుండి ఉపశమనం కలిగిస్తుంది. అనాసిన్ బలీయమైనది—అది ప్రపంచమంతటా డాక్టర్లు సిఫారసు చేసే బాధా నివారక పదార్థం కలిగి యున్నది. అనాసిన్ లక్షలాది ప్రజలకు విశ్వసనీయమైనది. డాక్టర్లు ఇచ్చే విశ్వసనీయమైన ప్రిస్క్రిప్షన్ లాగా అది మందుల మిశ్రమం. జలుబు, ఫ్లూల యొక్క హెచ్చరిక లక్షణాలు కనిపించగానే, అనాసిన్ కొంచెం నీళ్ళతో రోజులో నాలుగు సార్లు తీసుకోండి.

### మీరు ఇంకా ఏమి చేయాలి?

- మరగబెట్టిన నీరు, నారింజ లేదా బత్తాయి పండు రసం లాంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తాగండి.
- పుష్టికరమైన ఆహారాలను తినండి.
- తగినంత విశ్రాంతి తీసుకోండి.
- అంటిసెప్టిక్ ద్రవముతో లేక ఉప్పు నీళ్ళతో గొంతుకు పుక్కిలి పట్టండి.



శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన
మేనర్స్
అనాసిన్*

భారత దేశపు ఎక్కువ జనప్రియమైన నొప్పినివారిణి
జెఫ్రీ మేనర్స్ వారి అనాసిన్ విభాగం మంచి

*Regd. T.M.

[illegible]-6/79


నుంచిది కాదని ఎవరి ఇండ్లకు వాళ్ళు బయలు దేరారు. సారధిమాత్రం తటపటాయిస్తున్నాడు. సీతమ్మ గారు గమనించింది. "బాబూ! ఈ రాత్రి మరేం వెడతావు? తోట చూస్తే మైలు దూరం ఉంటుంది. రేపు ఉదయం దాకిలే మొస్తాయి ఈ తుఫాన్‌కి? తోటమాలి ఉంటాడు. నీ విక్కడే ఈ రాత్రి ఉండిపో. నీ కోసం ఎదురు చూచేవారు మాత్రం ఎవరు?" అందామె. సారధి ఆ వూరికి కొత్తగా ఉద్యోగం కోసం వచ్చిన వ్యక్తి.

ఆమె అన్న మాటలు వాస్తవాలే. వూరికి రెండు చివర్లలో విసిరేసినట్టుంటాయి మామ్మ హోటలు, సీతాపతిరావు కొబ్బరితోట. ఒక మైలు దూరం వాటి మధ్య. మామ్మ హోటలుకు అర ఫర్లాంగు దూరం వరకు ఇళ్లే ఉండవు. ఇటీవలే ఆశ్రమం లాగ ఉండే హోటలు పక్క ఒక పూరిల్లు వెలిసింది. అది పగడాలు కాఫీ హోటలుగా మార్చి నడుపుతూంది. ఒక ఆయిదారు నెలలు నుండి ఆమెకు తోడు రామయ్యతాత.

సీతమ్మగారి మాటలకు సారధి ఇబ్బందిగా ముఖం పెట్టాడు.

"నీ ఇష్టం. ఆలోచించు. నీకు గొడుగుకూడా లేదు. ఈ వానలో తడిసి ముద్దయి ఆ తోటకి వెళ్ళి చేసే దేముంది? ఈ గాలివానలో తోటలో ఉండటంకూడా మంచిది కాదు. ఏ చెట్టు విరిగి మీద పడ్డా కాచేదెవరు? నీకా—వూరు కొత్త. నీవు వచ్చి వారం రోజులుకూడా కాలేదు. ఇక్కడ ఉండటం ఇష్టం లేకపోతే జోగినాధం ఇంటికైనా వెళ్ళిపో. నే చెప్పానని చెప్పు. తోటలో మాత్రం ఈ రాత్రి ఉండవద్దు."

సారధి ఆలోచనలో పడ్డాడు. తోట నెవరైనా దోచుకుపోతారేమోనని భయం.

"ఏ మాత్రం తగ్గినా వెళ్ళిపోతాను. తోటలో లేనని తోటమాలి చెప్పాడంటే ఈ మాత్రం ఉద్యోగమూ వూడుతుంది."

"సరే! అలాగే చెయ్యి" అందామె ఎంగిళ్ళు ఎత్తుతూ.

సిగరెట్ ముట్టించుకునేందుకు దీపపు బుడ్డి ముందుకు వంగాడు సారధి. వీధి తలుపుకి కిరకిర లాడింది. మామ్మ వీధిలోకి చూచింది. సగం తడిసిన పగడాలు ఇంటిలోకి అడుగు పెడుతూ సారధిని చూచి ఒక అడుగు వెనక్కి వేసింది.

"ఏం, పగడాలూ, ఇలా వర్షంలో తడిసిపోయి వచ్చావు? లోపలికి రా!" పిలిచిం దామె. సారధి వైపు బెరుకుగా చూస్తూ లోపలికి వచ్చింది పగడాలు. సారధి అవతలికి వెళ్ళిపోయాడు సిగరెట్ కాల్చుకునేందుకు.

"తాత టవున్నుండి ఇంకారాలేదండి అమ్మగారూ!"

"వచ్చేస్తాడు లేవే! గాలీ, వానా కదా. కాస్త ఆలస్యమయ్యుంటుంది. అందులో టవున్నుండి బస్సులు నడవాలా? జంక్షన్ దగ్గర దిగి ఈ నాలుగుమైళ్ళూ నడిచి రావాలా!"

సీతమ్మ గారి మాటలకు బిక్క చచ్చిపోయి నిలబడిపోయింది పగడాలు.

"నీ తాతకేమీ గాదు. భయపడి చచ్చిపోకు. ఇంతకీ భోజనం చేశావా?"

"లేదండి. ఆ డౌస్తాడని నూస్తున్నానండి."

"వంట చేశావా ఇంతకీ? లేకపోతే ఇక్కడే నాలుగు మెతుకులు తిను."

"వంట ఒండేశానండి."

"మరయితే ఏం? వేడి వేడిగా తిని హాయిగా పడుకో. వాడు గాలీ, వానా తగ్గాక వస్తాడ్లే!"

"ఒక్కత్తినీ— భయమేస్తుందండి."

"భయమెందుకే, పిచ్చిదాన! తలుపు గడియేసి పడుకో. అంతగా భయమైతే ఒక్క కేక వెయ్యి. వచ్చి నీ దగ్గరే పడుకుంటాలే."

పగడాలు ముఖం వికసించింది. "అంతేనండి అంతే!" అంటూ ముఖం మీది నీళ్ళు తుడుచుకుని, చీర కొంగు తల మీదికి లాక్కుంటూ తలుపు వేసుకుని ఇవతల పడింది పగడాలు. అంతలో పెద్ద మెరుపు మెరిసింది. వెను వెంటనే పెద్ద ఉరుము ఉరిమింది. "వోలమ్మో!" అంటూ ఇంట్లోకి పరుగెత్తుకుంటూ వచ్చేసింది.

"అంత భయమయితే ఎలా బతుకుతావే? మెరుపులు, ఉరుములు ఏంజేస్తాయి? పెళ్ళి దీపాలూ, పెళ్ళి మేళాలూనూ అవి."

"అట్టాగాండి! అయితే ఎళ్తానండి. మీరలా అరుగుమీద నిలబడి నూస్తూ ఉండండి. నే నెళ్లిపోతాను."

"ఎక్కడ పిచ్చి మాలోకానివే. పద" అంటూ వీధిలోకి నడిచిం దామె. పగడాలు కంచె దాటి, వీధిని చేరి, తన ఇంటిని చేరేంతవరకు వీధిలో నిలబడిం దామె. ఈ లోపల రెండు మూడు సార్లు వెనక్కు చూసుకుంటూ వెళ్ళింది పగడాలు.

"ఒట్టి పిరికి సన్నాసి!" అనుకుంటూ వెనుతిరిగిన ఆమెకు సిగరెట్ కాల్చుకుంటున్న సారథి కనిపించాడు.

"ఎవరూ? సారథి!"

"నేనే మామ్మ గారూ!"

"ఇవతల ఎందుకూ నిలబడ్డావ్!"

"సిగరెట్ కాల్చుకుందామని."

"సరే. నీవు ఈ రాత్రి ఇక్కడే పడుకో. అది భయంతో చస్తుంది. నేను దానికి తోడుగా అక్కడే పడుంటాను. లోపలికి రా. అక్కడ ఉంటే తడిసి పోతావు. అరుగు తడిసిపోలేదూ!"

సారథి సిగరెట్ పారేసి లోపలికి వచ్చాడు.

"నేను వంటిల్లు సర్దుకుంటాను, భోజనం చేసి. నీకు నిద్ర వస్తే అదిగో ఆ పక్కగా ఆ తడక పక్కకి వెళ్ళి పడుకో. అక్కడ మంచం, బొంత, దుప్పటి, తలగడా ఉన్నాయి. ఒకప్పుడది శాంత గది. ఈ భవనంలో గదులు ఎక్కడినుండి వస్తాయి. చెప్పు? దాని కోసం అలా గదిగా చేశా. ఇప్పుడది లేదు. పెళ్ళయి అత్తవారి ఇంట ఉంది. అయినా ఆ గది శాంతదే" అంటూ తనలో ఏదో చెప్పుకుంటూ వంటింటి వైపు వెళ్ళిపోయిం దామె.

పాంటు షర్టుతో పడుకోవడ మెలాగ అనుకుంటుండగా "ఇదిగో, నా పంచె లుంగీలా చేసి కట్టుకో. రేపు స్నానం చేసేటప్పుడు తడపేద్దువు గాని" అంటూ తెల్లని పంచె తడక మీద పడేసి వచ్చినంత త్వరగా తన పనిలోకి వెళ్ళిపోయిం దామె. సారథి బట్టలు మార్చుకున్నాడు. గది చాలా శుభ్రంగా ఉంది ఆమె మనసులా. చిన్న కిటికీ ఉంది ఆ పక్కనే వీధి వైపు. తెరిచాడు. సన్నగా చలి గాలి లోపలికి వస్తున్నా, చాలా ఆహ్లాదంగా ఉంది. కడుపు నిండా భోజనం చేసిన తరవాత నిద్ర బరువుగా ఒంటి మీద కూర్చున్నట్టనిపించింది. మంచం మీద వాలాడు సారథి.

వర్షం దోరణిలో మార్పులేదు. గాలి కూడా అలా వీస్తూనే ఉంది.

సీతమ్మగారు భోజనం చేసి వంటిల్లు సర్దుకునే సరికి సరిగా గంట పట్టింది. ఆమె చేసే గిన్నెల చప్పుళ్ళు, చీపురు కట్ట బరబరలు సారథికి వినిపిస్తూనే ఉన్నాయి కాని, కళ్ళు తెరవటానికి బద్ధకం. ఆ నిద్ర హాయిగా ఉంది అతనికి.

సీతమ్మ గారు వంటింటి పక్క వసారాలో పక్క పరుచుకుని నిద్ర పోవడానికి సిద్ధపడుతున్న సమయం.

వీధి తలుపు మీద టకటక ధ్వని.

'ఈ పిరికి సన్నాసి మళ్ళీ పరుగెత్తుకొచ్చిందా?' అని తనలో తా ననుకుంటూ తలుపు తీసిం దామె. ఎదురుగా పంతులు గారి చిన్నకొడుకు, వాళ్ళ పనివాడు.

"నొప్పులొస్తున్నాయి—మా అమ్మ మిమ్మల్ని రమ్మంది."

"నొప్పు లెవరికిరా? నీకా? వెధవా! సరిగ్గా చెప్పి ఏడువు."

"నాక్కాదు. మా అక్కయ్యకి. అమ్మ కంగారు పడుతూంది. వెంట తీసుకోరమ్మంది. గొడుగ్గూడ తెచ్చా."

"అలా వచ్చి లోపల నిలబడు. వచ్చేస్తా... ఒరేయి పెంటిగా! కాస్త లోపల కొచ్చి నిలబడు. వర్షం జల్లు ఇంట్లోకి రావటంలే తలుపుతీస్తే!" అని వాణ్ణి హెచ్చరించి గూట్లో ఉన్న కళ్ళజోడు అందుకుని, వంట గదిలో అల్మయిరా లోని సీసాలోంచి ఉప్పు చెక్కను తుంపి నోట్లో వేసుకుని, కొద్దిసేపు ముందు గదిలోనే ఏదో ఆలోచిస్తున్న దానిలా అటు ఇటు పచారు చేసి నెమ్మదిగా సారథిని పిలిచింది. సారథి లేచాడు. వంటింటి గుమ్మంవైపు తీసుకెళ్ళింది. నెమ్మదిగా అంది.

"సారథి! నీ వీ వూరికి కొత్త వాడివి. నీ కో విషయం చెప్పాలి..." అని ఆగి,

"సరే! ఈ విషయాలన్నీ నీకెందుకు గాని... చూడు. మనలో జాతులు, కులాలు వేరైనా పెద్ద చిన్న, ఆడ మగ అందరికీ ఒకటి మాత్రం సమానమే. అదే ఆకలి. అదిగో అటు చూడు. ఆ కంచం కింద ఆకులో అన్నం, కూర, కొద్దిగా పచ్చడి ఉంచాను. ఆ సత్తు గిన్నెలో పులుసుంది. ఈ రాత్రి ఎవరు వచ్చి పిలిచినా 'నీవెవరు?' అని అడక్కుండా ఇవి పడేయి. ఇక్కడ తింటే నాలుగు గ్లాసుల మంచినీళ్ళివ్వు. లేదంటే పట్టుకుని పోయినా మంచిదే. గుర్తుందికదూ? నేను పంతులు గారి ఇంటికి వెళుతున్నాను. వాళ్ళమ్మాయి ప్రసవించే సమయం. నీవు తలుపు వేసుకో. మరి నే వెళతాను" అని తాళం చెవులు గల పంచె కొంగును బొడ్డులో దోపుకుని? "పదండ్రా!" అంటూ

డా॥ పి.వి.కె. రావ్, B.A.

సెక్స్ స్పెషలిస్ట్
(వైద్య విద్వాన్ - వైద్యాచార్య)
వివాహము వాయిదా వేయ నవసరము లేదు. దురభ్యాసములవలన కలిగిన నరముల బలహీనత, సుఖవ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు ... ...
రావూస్ క్లినిక్,
టి.బి.రోడ్, తెనాలి. ఫోన్: 700.

మీకు బేబి/బాబు కావాలా

ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలతో ...
శ్రీ నాగార్జున మూలిక కుటీరం
రల్వే స్టేషన్ వద్ద, రామాలయం వీధి.
తెనాలి - 2

స్థాపితం-1936. ఫోన్-516
అందానికి ఆనందానికి
శ్రీ స్వదేశీ
ఆభరణములు
22 లా. బంగారు కవరింగ్ చేయబడినవి.

శ్రీ స్వదేశీ గోల్డు కవరింగ్ వర్క్సు
మచిలీపట్నం-2.
బ్రాంచీలు: విజయవాడ. భీమవరం. గుడివాడ. కాకినాడ. రాజమండ్రి. హైదరాబాద్. విజయనగరం. తెనాలి...











సారధి వైపు ఒకసారి చూచి ముందుకు వెళ్ళి పోయిందామె, గాలి వానలో.

ఆమె కనుమరుగయ్యేంత వరకూ చూచి లోపలికి వచ్చి తలుపు వేసుకుని పడుకున్నాడు. అంతవరకు ఉన్న మత్తు విడిపోయింది. నిద్ర తేలిపోయింది. అటు ఇటు దొర్లాడు. నిద్ర రావటం లేదు.

'కొంచెం పడుకొండాయిందేమో?' గొణుక్కున్నాడు.

వాన, సముద్రపు హోరుతో కలిసి గాలిలో సయ్యాట లాగుతూంది. ఉండి ఉండి మెరుపులు, వెనువెంట ఉరుములు. రోడ్డు మీద పారే నీటి రొద. గాలిలో మంచులాంటి తేమ. ఆ గాలి మోస్తున్న నీరు వాసన. ఎక్కడో ఏదో విరిగిపడుతున్న ధ్వనులు. పది మంది ఒక్కసారి అరిచినట్టు గాలిరొద. వెదురు చువ్వలు గాలిలో కదిలి చేసే 'సయ్యన్న' ధ్వనులు. ఒక్కసారి భూమిలోకి క్రుంగి పోతున్నట్టు, మరోసారి ఎక్కడికో పైకి గాలితో బాటు లేచి పోతున్నట్టు అంతా గందరగోళంగా. సారధి నెమ్మదిగా మగత నిద్రలోకి జారిపోయాడు.

నిద్రలో ఎవరో అరుస్తున్నట్టూ, పిలుస్తున్నట్టూ.

ఇంతలో ఎవరో తలుపు మీద బాదుతున్న ధ్వని. ఉలిక్కి పడి లేచాడు.

"మామ్మగారూ! మామ్మగారూ!" చిన్నపిల్లవాడి గొంతులా చాలా పీలగా. తలుపు దగ్గరికి వెళ్ళి తీశాడు. వానజల్లు ఒక్కసారి ముఖం మీద కొట్టింది. ఒక్కసారి ఒక అడుగు వెనక్కు వేశాడు. అదే వేగంతో ముందుకు వచ్చిన పగడాలు సారధిని చూసి "మామ్మగారు. . ." అంటూ ఆగిపోయింది.

"మామ్మగారు లేరు. ఎవరి ఇంటికో వెళ్ళారు. ఏం కావాలి?"

"రేకులషెడ్డు రేకు లెగిరి పోతున్నాయి. అయి పోతే గోడలు పోతాయి. మామ్మగారు..." అంటూ ఏదో గొణిగింది.

"ఈ గాలిలో ఎగిరి పోయే వాటిని ఎవరు మాత్రం పట్టుకోగలరు?"

"కొబ్బరి చెట్టుకాడే పడుండాయి. మీ వొస్తావా?"

"పద. రేకు లెగిరి పోకుండా నైనా తెచ్చుకుందాం" అంటూ ఆమెతో బాటు వర్షంలో కదిలాడు సారధి. గాలి వూచి పెట్టి కొడుతూంటే అతని చేతిని గట్టిగా పట్టుకుంది పగడాలు. పొడుగు మనిషికావడం చేత సారధి గాలిలో కదిలి పోతున్నాడు. గాలిలో పగడాలే అతనికి ఆధారంలా ఉంది. మెరుపుల్లో కొబ్బరి చెట్టు మొదల్లో గాలిలోకి లేచి క్రింద పడుతూ దిక్కు తోచక అల్లలాడే తారు డబ్బా రేకులు కనిపించాయి —"అయ్యగో, అయ్యో!" అరిచింది పగడాలు.

ఇద్దరూ పరుగెత్తారు. రెండు రేకులు జాయింట్లు చేయబడి బరువుగా ఉన్నాయి. వాటిని పట్టుకుని నెమ్మదిగా ఈడ్చుకొచ్చి వాకిలి ముందుపడేసి వూపిరి తీసుకోవడానికి నిలబడి పోయారు. వాన చినుకులు వారి కనురెప్పల మీద, పెదవుల మీద పడి సూదుల్లా గుచ్చుతున్నాయి. వాన నెత్తిమీద మొత్తుతూంటే వూపిరాడక ముఖాన్ని వాననుండి దాచుకుంటూ ఇంటి అరుగెక్కింది పగడాలు.

"ఈ రేకులు..." ఆయాస పడుతూ ఆగిపోయాడు సారధి.

"ఇంటిలోన పడేస్తావా? ఈ వానలో కట్టినా ఉండవు. ఎగిరి పోతాయి" అంటూ వానలోకి వచ్చి

రేకుల చివరలు అందుకుంది పగడాలు. ఆమె శరీరం మీదికి తిరగబడ్డాయి రేకులు. కింద పడబోయిన పగడాల్ని గట్టిగా పట్టుకున్నాడు. రేకులు ముందుకు కదిలి రాబోతూంటే అతని పట్టు వదిలించుకుని ముందుకు వెళ్ళింది. ఇద్దరూ నెమ్మదిగా ఇంటి లోపలికి రేకులు తెచ్చి పడేశారు. ఇంటికి రెండే గదులు. ముందు గది ఉరుస్తూ నేలను తడుపుతూంది. వాళ్ళు నిలబడ్డ ప్రదేశం అంతా మట్టి నేలను తడి చేసింది. ఇంటి మీద పురి గాలికి లేచి ఎగిరి పడుతూంది. సారధి పైకప్పు వైపు చూస్తూ, "కప్పు కూలిపోతుంది" అన్నాడు, ఏదో జ్ఞానాన్ని పొందిన వాడిలా.

"అమ్మయ్యో!" అంది రెండు చేతులు గుండె మీద వేసుకుని. వెనువెంటనే పైట తొలగి పోయిన విషయం గమనించి సారధి చూడకుండా సర్దుకుంది.

"నీ వెళ్ళి మామ్మగారింట్లో పడుకో. నే నిక్కడ ఏదో మూల పడుంటా!"

"కప్పు కూలిపోద్ది. నివ్వు సస్తవు."

"నేను చచ్చినా పర్లే. నీవు వెళ్ళు."

"నివ్వు శాన మంచోడివి. పద—మామ్మగారింటి కాడికే ఎలదాం" అంది.

"మామ్మ తిడుతుంది."

"నాను సెప్తా. పద" అంది. అయిష్టంగా కదిలాడు సారధి. పగడాలు ఇంటిలోకి వెళ్ళి పొడిబట్టలు కాన్వాస్ సంచిలో పెట్టుకుని బయట పడింది.

"లోపలి కెళ్ళి బట్టలు మార్చుకో! నే నిక్కడుంటా". లుంగీ చివర్లు పిండుకుంటూ అన్నాడు.

"కాదు. గది తడిసి పోద్ది. నే నిక్కడే మార్చుకుంటాలే."

"ఛీ! వీధిలోనా!"

"సీకటేలే! ఎవలూ సూడ్రు. నివ్వు లోన కెల్లు."

తలుపు దగ్గరికి వేసి శాంత గదిలోకి ఈ తడి వెళ్ళి బట్టలతో ఈ రాత్రి గడిపే దెలాగ?' అని ఆలోచిస్తూ నిలబడ్డాడు.

వీధిలో మెరుపులు కిటికీలోంచి అతని మీద పడుతూంటే సారధి ఆలోచనలు ఒక్కసారి ఆగిపోయాయి. మెదడు స్తంభించి పోయింది. మంచం మీద అలాగే కూలబడిపోయాడు. మెరుపులు అతని ముఖం మీదికే సరాసరి వచ్చి పడసాగాయి. కిటికీలోంచి చూస్తూ అలానే ఉండిపోయాడు. పగడాలు బట్టలు మార్చుకుని లోపలికి వచ్చింది.

పాంటు, షర్టు వేసుకుని ఇవతలికి వచ్చాడు సారధి.

"బట్ట లేసికున్నవ్! ఎల్లి పోతవా?"

"లేదు. నా కివే బట్టలు. మరి లేవు." మాటలు తడబడ్డాయి.

అతని శరీరమంతా వణుకుతూంది. నుదుటి మీద, వెన్ను వెంట చిరు చెమట. అరిపాదాలలో సన్నని మంట. వేగాన్ని మించి ప్రవహించే రక్తతీవ్రత. కంటి ముందు మెరుపులు. ఆ మెరుపుల్ని మైమరిపించే మెరుపులు. సారధి ఆమెనే చూసేస్తున్నాడు.

చీర, లంగా పిండుకుని ఒక వారగా గోడ మేకులకు [illegible]ట్టింది పగడాలు. పెరటి వసారాలోకి వెళ్ళి తడి జాకెట్టునే పిండుకుని వేసుకుని వచ్చింది. పొడవైన తడిజుట్టును ఆరబెట్టుకుంటూ, "యా వూరు నీది?" అడిగింది. గోడకు ఆనుకుని మోకాళ్లు కాలేసుకుని కూర్చుంటూ.

ఆమె అప్పుడప్పుడే నిద్రకు ఉపక్రమించేటట్టు లేదని తెలుసుకుని, "పట్నం—ఇక్కడికి చాలాదూరం" అన్నాడు, పొడుగాటి కొయ్య వాలు కుర్చీలో కూర్చుంటూ.

"కొత్తగొచ్చినవా?" జుట్టును ఒకసారి దులుపుకుంటూ అడిగింది.

అవునన్నట్టు తల వూపాడు, సిగరెట్ వెలిగించుకుంటూ.

"యాం పని మీ దొచ్చినవు?"

"ఉద్యోగం కోసం."

"పట్నంలో దొరకని ఉద్యోగము ఈ పల్లెటూర్ల దొరుకుద్దా?"

"సీతాపతిరావుగారు మా బాబాయికి బాగా తెలుసు. ఇతను పెద్ద పేరున్న మనిషి. ఇతని కెందరో తెలుసు. కొద్ది కాలం తన తోట వ్యవహారం చూడమన్నాడు. తరవాత పట్నంలో ఏ కంపెనీలో నైనా ఉద్యోగం వేయిస్తా నన్నాడు."

"ఉద్యోగాలు పట్నాల్లోనే. పెద్ద ఉద్దోగాలు దొరుకుతాయి. ఇట్టాటి వూర్ల సిన్న ఉద్దోగాలే. నా మావ భీశాయిలో ఉద్దోగం. ఇప్పుడు ఉద్దోగం సిన్నదే గాని, ఒక సమత్సరానికి పెద్ద దవుద్దట. ఈ వూరు మా కన్నా రూరు. అమ్మా, నాయినా లేరు. మా తాతే పెంచి పెద్ద చేసి, ఎదిగనాక, మనువు కుదిర్చి పెళ్ళి చేయించనడు. ఆడికి నానంటే శాన పేమ. ఆడింట్ల ఉంటే కొండంత దయిర్యం. ఆడికే ఈ మద్దెన సుస్తీ సేసినది. అందుకే నే నొచ్చినను. సంకురేత్రిపండగ ఇరిగినాక మల్లా ఎల్పోత. మా మావస్తడు. ఆడే తీసికెల్తడు. నీకు పెళ్ళయినదా?"

"ఒక కూతురు."

"ఆహా! ఉద్దోగం లేదూ? పెద్ద కట్టమే. అతోరు డబ్బున్నారేనా?"

"వూహూ!"

"అయితే పెద్ద కట్టమే. రెక్కల కట్టం మీద ఒతుకులా. సీతాపతి ఉద్యోం ఏయించేది కాయమేనా?'

ఖాయమే అన్నట్టు తల వూపాడు సారధి.

"ఆడో దొంగ. ఒట్టి దొంగ సచ్చినోడు. ఆడికి ముగ్గురు భార్యలు. పిల్లల్లేరు. నాలుగో పెళ్లి సేసికుంటాడంట. ఈ భార్యలు సాలక వూరి మీద పడతడు. ఆడి కొబ్బరితోట సూసినవా? ఎంత పెద్దది! కానే ఒక్క కాయ ఎవుర్ని కొయ్యనీడు. నూకాల పేరు ఇన్నావా? ఆడు కొబ్బరికాయలు దొంగతనపు సేసినడని వారం రోజుల కితము కొబ్బరిసెట్టుక్కట్టి కొట్టించినాడంట. వూరిడిసి పొమ్మన్నడంట. ఈడు సంపనానికి సీతాపతి కొంప మీది కెల్లినాడంట. సీతాపతి దొర్కలే. నూకాలంటే బయటపడి సత్తన్నాడు. ఆడెప్పుడైనా వస్తడు. ఇప్పుడు వూర్లో లేడు. నూకాలు వూరిడిసి పారిపోనాడంటారు. ఆడెప్పుడైనా వూరిగొస్త డంతరు కొందరు. నూకాలు తాగుబోతు గాని, దొంగకాడు. చ. చ్చ! ఆడు దొంగతనం సేస్తడంటే ఎవురూ నమ్మరు. ఆడ్ని సూస్తే పతీ ఆడదానికీ భయమే. ఆడు ఎవర్నైనా ఏటిసేసి నాడని ఎవరూ సెప్పలేదు

కావలెను

తీరిక కాలములో శక్తి షూటింగ్స్, షర్టింగ్సు మరియు చీరెల అమ్మకము పెంపొందించుట ద్వారా జీతం లేదా కమిషను మీద నెలకు రు. 700/— సంపాదించుకొనుటకు ఏజంట్లు కావలెను. ఉచిత లిటరేచరుకు, శాంపిళ్ళకు వ్రాయండి.

SHAKTI TEXTILES AGENCY (AP)
Post Box No. 1138, Delhi-110006

1981 సినిమా డైరీ

ఇందులో తెలుగు, హిందీ నటీనటుల అడ్రసులు (ఫోను నంబర్లతో సహా) కలవు

కావలసిన వారు ఈ క్రింది అడ్రసుకు రు. 2/- ఎం.ఓ. చేయండి. డబ్బు కవరులో పెట్టి పంపకండి.

వై. కె. మూర్తి
దాసరి వారి వీధి, విజయవాడ-2.

దేహపుష్టికి ఆరోగ్యానికి

పండిత డి. గోపాలాచార్యులవారి

జీవామృతం

1898 నుండి ప్రసిద్ధి గాంచినది

ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17.

మీకుపయోగించేది

ఇంట్లో ఎవరికే రోగం వచ్చినా కంగారు పడేపని లేదు. ఐదురకాల ప్రఖ్యాత వైద్యులు ప్రతి రోగానికి, రోగలక్షణాలు, వాటి నివారణకు ఇంగ్లీషు, ఆయుర్వేద, ప్రకృతి, మూలిక, హోమియో మందులు, "ఐదు వైద్య విధానాలు" అనే తెలుగు పుస్తకంలో అందరికి తెలిసేలా వ్రాశారు. అన్నీ షాపుల్లో దొరికే మందులే. 427 రోగాలు నయము చేసుకొనే మార్గాలున్నాయి. వెల రూ. 16. పోస్టు ఖర్చులదనం. దేశసేవ ప్రచురణాలు, 5/3 ఆర్.టి. పంజాగుట్టకాలని, హైదరాబాదు-4కు, మీకో పుస్తకం వి.పి. పోష్టులో పంపుమని వెంటనే వ్రాయండి.




Studio Amin/SC

గాని ఆడముఖము, ఆడి మీసాలు, ఉంగరాల జుత్తు. గొప్ప భయమేస్తది. ఆడు గౌరీ పున్నమి పండక్కి తాట్రాజా యేసం ఏస్తడు. అదే ఆయాసాన్ని ఈ పూర్ణకి తెచ్చినది. ఆ రోజున ఆడ్ని సూస్తే గొప్ప భయమేస్తది."

"తాట్రా జెవరు?"

"నాకు పెద్దగ ఎరిక నేదు గాని, గొప్ప గనమైనో డంటారు. అల్లూరి సీతరామరాజు పేరిన్నావా? తెల్లోళ్లని ఎదిరించి నాడు కద? అనుంటోడే తాట్రాజు. ఆడు కొండల్లోకి తిరిగే వోడంట. ఆడికి పెద్ద సైన్నముంట. ఆడంటే తెల్లదొర్లకి గుండెల్లో దడ. సివరికి తాట్రాజుతో తిరిగినోడే—నేస్తమే—తెల్లదొర్లకి పట్టి ఇచ్చినాడంట. ఈ కథ నంతా గౌరీ పున్నమి పండగల్లో మా పూర్ణయాసాలేసి సూపుతరు. నాకాలు తాట్రాజు యాసం గొప్ప గేస్తడు. మీసాలు మెలి పెట్టి పూర్ణ తిరిగినాడంటే ఆడు నాకాలు కాడు. తాట్రాజే."

"నీకు నిద్ర రాదా?"

"యావి! ?"

"నాకు నిద్రవస్తోంది" అన్నాడు ఒళ్ళు విరుచుకుంటూ.

"నే నిలా కూకుంటాలే. నీవు తొంగో" అంది వక్షం మీద జుత్తును ఆరబెట్టుకునేలా వేసుకుని. కాళ్ళ మునుకుల చుట్టూ చేతులు వేసుకుంటూ.

"నే నంటే నీకు భయమా?"

"శా. నాకేం బయ్యం? నీవు శానా మంచోడివి."

"లేదు. నేను చాలా చెడ్డవాడిని. నీవే నన్ను చెడ్డవాణ్ణి చేశావు" అంటూ రెండు అడుగులు ముందుకు వేశాడు సారథి. అతని కళ్ళ ముందు కదిలిన దృశ్యాలు అతన్ని పిచ్చివాడుగా ముందుకు నడిపిస్తున్నాయి. వర్షంలో తడిసిపోయిన పగడాలు తన్ను గట్టిగా పట్టుకున్న స్పృహ, తారు రేకులతో సతమతమవుతూ పడబోయి శరీరాన్ని కౌగిలించుకున్న ఒత్తిడి, వీధి అరుగుమీద మెరుపుల్లో మెరుపులు ప్రతిక్షణం వింతైనవని అతనికి చెబుతున్నాయి. ఒళ్ళు కొద్దిగా విరుచుకుని మరి రెండు అడుగులు ముందుకు వేశాడు.

పగడాలు అతని కళ్ళలో తీవ్రతను గమనించింది. నెమ్మదిగా లేచి నిలబడింది.

"నీవు చాలా అందంగా ఉన్నావు. నీ వంటే నా కిష్టం. నేను నీ కిష్టమే కదూ?" నెమ్మదిగా చెయ్యి పట్టుకున్నాడు.

"శా! నే ననుంటిదాన్ని కాను. నన్నిడిసి పెట్టు" చెయ్యి వదిలించుకో బోతూ అంది పగడాలు.

"నేనూ మంచివాడినే. కాని ఇప్పుడు చెడ్డవాణ్ణి" అంటూ రెండవ చేతో పట్టుకోబోయాడు. పగడాలు అందక తప్పించుకుందా మనుకుంది. సారథి గట్టిగా పట్టుకున్నాడు. పగడాలు ప్రతిఘటించక కొద్ది క్షణాలు ఆగింది ఏదో నిర్ణయానికి రాబోతూ. అంతలో దగ్గరికి తీసుకోబోయాడు.

"ఆగు. మా ఇంటికి ఎల్దాము. పద" అంది.

"మరి చెప్పవేం? కాని అక్కడ కొంప ఎప్పుడైనా కూలి ఇద్దరం చస్తాము."

"ఈడ మాత్రవు కొంప కూలక పోయినా నివ్వు నేను నవ్వాలసిందే. ముందు నిన్ను నేనంపాల. తరవాత నేను సవ్వాల. కాని, ఈ ఇంట్ల మాత్రవు వద్దు. ఇది మంచోళ్ళు ఉండే చోటు" అంటూ

ఒక్క ఊపున విదిలించి దూరంగా పోయింది.

"ఏయ్!" అంటూ మీదికి రాబోయాడు. "మంచిగా మాట్లాడుతుంటే ఇలాగే ఉంటుంది వ్యవహారం" అంటూ రెండు చేతులతో పట్టుకున్నాడు.

"అదే నేను చెప్తున్నాను. ఇడిసిపెట్టు. లేకపోతే చంపుతా!" చొక్కా కాలరు పట్టుకుని అంది పగడాలు.

"నాకు భయం లేదు." ఇంకా దగ్గరికి రాబోయాడు. గోడ పక్క నుండి తప్పుకుంటూ గోడకు అభిముఖంగా తిరిగింది పగడాలు. చొక్కా కాలరు వదిలి పెట్టక "ఇడిసిపెట్టు" అంది. సారధి ఇంకా ఆమెను తన వైపు లాక్కోవాలనే ప్రయత్నం చేశాడు. చొక్కా కాలరు వదిలిపెట్టి రెండుచేతులతో జుత్తునంది పుచ్చుకుని బలంగా తల గోడకేసి కొట్టింది. సారధి తల గింగురుమంది. అమ్మో" అంటూ పగడాల్ని వదిలేశాడు. రెండు చేతులతో తల పట్టుకుని తేరుకునేటంతలో కాలితో పొట్టలో ఒకటి ఇచ్చింది. ముఖం మీద పిడికిలితో మరి రెండు. సారధి ఉమ్మ చుట్టుకుని నేల మీద పడి పోయాడు, బాధతో పొట్టను రెండు చేతులతో పట్టుకుని.

పగడాలు కుడి కాలిపాదాన్ని అతని పొట్టమీద ఉంచుతూ, "ఇప్పుడు చెప్పు—నీకేటి కావాల? గుక్కెడు మంచినీళ్ళు. అవునా! కాని, ముంగల నిన్ను నేను సంపాల. నీలాటోళ్ళు తిండికి మొకం వాచిన్నాడు తిండి దొరికితే పొలంతారు. తిండి దొరికినంక ఒళ్ళు బలిసి... ఆడది కావాలంతారు. ...మిమ్మల్ని ఎవరూ నమ్మలేరు" అంటూ ఒక్క తోపు తోసి పాదం తీసేసింది.

"మంచినీళ్ళు." గునిశాడు సారధి.

పగడాలు కొద్దిసేపు అతని ముఖాన్ని పరిశీలనగా చూచి దీపం బుడ్డి పట్టుకు వంటింటి లోకి వెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి నెమ్మదిగా అతని గొంతులో పోసింది. మంచినీళ్ళు తాగి నెమ్మదిగా మూలిగాడు పొట్టమీద చేత్తో రాసు కుంటూ.

"బాగ దెబ్బ తగిల్నాదా?... ఎక్కడ? ఇక్కడా? ఎల్లకీతలా పడుకో .నే రాస్తనులే.. బుద్దిగుంటవా మరి?... ఏలాగున్నది?... తగ్గినదా? తగ్గుతాదిలే. కొద్దిగా తిండి తగ్గించు... ఒళ్ళు బలిసినాదంటే కళ్ళు కనిపించవు..."

కొద్ది సేపటికి తేరుకున్నాడు. నెమ్మదిగా మంచం వైపు నడిపించింది, అతని ఒక చేతిని తన భుజం మీద ఉంచుకుని.

"హెయిగతోంగో! నా నెవరికి సెప్పనులే! కండ 'గ్లాసుకుని మల్లా మీది కొచ్చిన వంటే ఈ పాలి నిజంగా పంపుతా... గురుతుంచుకో" అంటూ వచ్చేసింది.

వర్షంలో తడిసిపోయినందుకు, సారధితో పోట్లాడినందుకు బాగా అలిసిపోయింది. కళ్ళ మీదకి నిద్ర వచ్చి పడుతూంది. కన్ను మూసిన మరుక్షణంలోనే సారధి వచ్చి మీదపడిన భ్రాంతి. గోడకానుకుని కూర్చుని రెండు మోకాళ్ళ చుట్టూ చేతులు వేసుకుంది. నిద్ర పోకూడదనే అనుకుంది. కాని, కను రెప్పలు బలంగా నిద్రాదేవిని కళ్ళలో బంధించాయి. గోడ కానుకున్నది ఒక పక్కకు ఒరిగి పోయింది. గాఢమైన నిద్ర. ఆ భయంలోనే ఆద మరిచి నేలమీద గోడ పక్కనే నిద్రపోయింది. ఆ నిద్ర ఎంతసేపో; అంతలో శరీరాన్ని ఇనప పిడి కిట్లోకి బంధించి క్రూరంగా హింసిస్తూ సారధి —

ఉలిక్కి పడి లేచింది. కళ్ళ ముందెవరున్నదీ తెలియనంత చీకటి. ఒక మూల దీపం బుడ్డి నిద్రకు మొగం వాచినట్టు చూస్తూంది. పగడాలు పరిసరాలు శ్రద్ధగా పరికించి చూచింది. ఎదురుగా ఎవరూ లేరు. అడుగులో అడుగు వేస్తూ నెమ్మదిగా సారధి మంచం వైపు వెళ్ళింది. సారధి నిద్ర పోతున్నాడు. పొట్ట క్రింద చెయ్యి అలానే ఉంది. నెమ్మదిగా భుజం తడుతూ లేపింది. కళ్ళు విప్పాడు.

"నెప్పి తగ్గలేదా?" అడిగింది.

"ప్రాణం పోయే నొప్పి తగ్గింది. నడవగలనో లేదో...కొద్దిగ చెయ్యిపట్టుకో" అంటూ ఆమె ఆసరాతో లేచాడు. నాలుగడుగులు వేసి తృప్తిగా ఊపిరి పీల్చాడు. పగడాలు భుజం వదిలి త్వర త్వరగా అడుగులు వేశాడు. ఉత్సాహంగా పదుము అటు ఇటు కదిపాడు. అతని ఉత్సాహం చూస్తే మళ్ళా ఏదో ప్రమాదం సంభవిస్తుందేమో అని భయపడింది పగడాలు. అతని కళ్ళలో మళ్ళా కోరిక. పగడాలకు అసహ్యమని పించింది. తన కోరికను వ్యక్తం చేస్తూ ఏవేవో సైగలు చేశాడు. పొడిచి చంపుతానన్నట్టు సమాధాన మిచ్చింది పగడాలు.

అంతలో ఏదోధ్వని అయింది, వీధి అరుగు మీద పగడాలికి ధైర్యం వచ్చింది. పైటకొంగు బొడ్డులో దోపుకుంది. తలుపు మీద టకటక ధ్వని సారధి పగడాలి వైపు ప్రార్థనా పూర్వకంగా చూస్తూ రెండు చేతులూ ఎత్తి నమస్కరించాడు. 'పోయి పడుకో' అన్నట్టు సైగ చేసింది. మళ్ళా తలుపు మీద ధ్వని. సారధి సద్దు చేయకుండా మంచం వైపు పరుగెత్తాడు.

పగడాలు తలుపు తీసింది. ఆమె ఊహించినట్టు ఎదురుగా సీతమ్మగారు లేరు. నల్లటి చిరిగిన రెయిన్ కోటులో, మెలి తిరిగిన మీసాలతో, సగం తడిసిన ఉంగరాల జుట్టుతో ఉన్న ఆకారాన్ని చూచి కెవ్వు మంది, "నూకాలూ—నివ్వా!" అంది భయంతో వెనక్కి అడుగువేస్తూ.

"శ! గోలపెయ్యకే. నేనే నూకాల్ని" అంటూ తలుపు గడియపెట్టి

"ఆకలవుతంది. మామ్మగార్ని నిద్ర లేపి, నే నొచ్చి నానని సెప్పు" అన్నాడు, వాలు కుర్చీ మీద రెయిన్ కోట్ ఉంచి. సారధి తడక సందులోంచి చూశాడు. చిరిగిపోయి మాసికలు పడ్డ నల్లని కోటు, మోకాలు క్రింది వరకు మడతలు పెట్టబడ్డ కాకీపాంటు, కుడిచేతికి వెండి కడియము, ఎర్రనై నిప్పులు కురిపించే కళ్ళు, మెలి తిరిగిన మీసాలు, విరజిమ్ముతున్న ఉంగరాల జుట్టు సారధి కంట పడ్డాయి.

"మామ్మగారు లేరింట. ఎల్లిపో! నీ కీడేటి పని?" అంది నూకాలుకు పెద్దగా అరిచి చెప్పాలని ప్రయత్నిస్తూ చెప్పలేక.

"మామ్మనేకపోతే నివ్వు లేవ? నా కోసరం అన్నం ఉంచుటాదే ఆ తల్లి? లోనకెళ్ళినప్రాయే గాలివాన కాదు గాని, కదల్నిచ్చి నాది కాదు. కడుపులో ఆకలి కరకరలాడతంది. పట్రాయే."





## అందమైన భార్య కావలెను

ఈ కాలంలో ప్రతీ యువకుడూ అందమైన భార్యనే పొందాలని కోరుకుంటున్నాడు. యువతులు కూడా చూడచక్కని వాణ్నే, అందమైన వాణ్నే భర్తగా ఎంచుకొంటు న్నారు. ఇదంతా అదృష్టంపైనే ఆధారపడి వుంటుంది. గోధుమవన్నె చాయ, నిర్రవి ముఖ వర్చస్సు కల చాలామంది యువతీయువకులు యుక్త వయస్సులో కేవలం ముఖంపైన **మొటిమలు** మరియు ముఖంలోని జిడ్డుతనం వలన నిరుత్సాహంగాను, కాంతి హీనంగాను కనపడతారు. అటువంటివారి పాలిట **సరూప్ లేప** నిజంగా ఒక వరప్రసాదమనే ఋజువు అవుతుంది.

జిల్లాంకు చెందిన ప్రసిద్ధిగాంచిన ఆయుర్వేదిక్ కంపెనీ "అమృత్ ఫార్మస్యూటికల్స్" సంప్రదాయమైన, ఆయుర్వేదపు సౌందర్య సాధనమైన ఈ "**సరూప్ లేప**"ను ప్రవేశపెట్టింది.

రాత్రి పడుకోబోయే ముందు ఈ "లేప"ని నీళ్ళతో కలిపి ముఖంపై రాయండి. ఇది **మొటిమలను**, మొటిమలవలన ఏర్పడిన నల్లని మచ్చలను రూపు మాపుతుంది. లేపని మీరు రాసుకున్నప్పుడు అది చర్మంలో ప్రవేశించి అదనపు మానెను, జిడ్డుతనాన్ని పీల్చివేసి మీ చర్మానికి ఉజ్వల కాంతి నిస్తుంది. మొటిమలు మటుమాయమవుతాయి. ముఖ వర్చస్సులో వచ్చే మార్పు వలన మీలో విశ్వాసం పెంపొందుతుంది. మీరు రోజంతా తాజాగా యవ్వనభరితులుగా సహజ సౌందర్యంతో హుందుగా వుంటారు.

"**సరూప్ లేప**" అన్ని ప్రముఖ మెడికల్ మరియు జనరల్ స్టోర్సులలో లభిస్తుంది.

రిటైలు ధర రూ. 6/—(చిన్నది)
రూ. 10—80(పెద్దది)
అన్ని పన్నులూ అదనం.

పంపిణీదారులు
**మోతీ అండ్ కంపెనీ,**
సుల్తాన్‌బజార్, హైదరాబాద్—500001

M. K. Publicity

"దొంగ వచ్చినోడ! దొంగ కబుర్లు సెప్పక. నీ పీడ కొమ్తున్నవని ఆ సీతాపతికి తెలిసినాదంటే ఆయమ్మ బతుకుపోద్ది. ఎళ్లిపో. ఎవాగొచ్చినవో ఎలాగో ఎళ్లిపో."

"సీతాపతే కాదే! ఆడ్ని పుట్టించినోడొచ్చినా ఈ యమ్మనేటిసెయ్యలేడు. ఈ రేత్రికి రేత్రే ఆడి పని సరి. ఎళ్లే! ముందు కూడ త్రాయే."

"ఒక ప్రెశ్నకి జవాబు సెప్పు—కూడెడతా!"

"ఏవే?"

"వూరంతకీ నివ్వే పోలీపోడిలా ఉండేవోడివి కదా? నీ వ్వెందుకు దొంగతనం సేసినవు?"

"నాను దొంగతనం సేసినానని మీరంతి అంతారు. కానీ, నాను దొంగనో, దొరనో మీ కెవరికీ ఎరికనేదే? వూరంతా నూకాలు పారి పోండని అంతారే గాని, రత్తాలు ఏటైనాదని ఒక్కరైన అడిగినరే? రత్తాలెవురో నీ కెరికా? సీతాపతి తోటలో పన్జేసే మొగుడు పోయిన ఆ పడుసుపిల్ల ఈ వారం దినాలై ఎవరికైనా కన్పడినాదే? ఆదేటయిందో నీ కరికా? నా కెరిక—అది ఎనాగ నచ్చినాదో నాకెరిక. సెప్పమంతావా? అది నీలాటి అమాయకపు పడుసే. ఈడి వల్లోపడినాది. మంగలల్లామను వాడతానని నమ్మించినాడు. ఇది నమ్మింది. అవసరం తీరిన ఆ పొద్దు సాయంత్రం దాని పీక నులిమి ఆ తోట్లోనే నంపినడు. ఎప్పుడు తీయించినడో గొయ్యి. దాన్ని పాతి పెడతా ఉంటే నా రగతం ఉడికెత్తినాది. అంతే. ఆడి మీద తిరగబడ్డ. ఆడి మనుషులు ఆడి కేక కొచ్చి కొబ్బరిసెట్టు క్కట్టి కాయ ల్దొంగ తనాని కొచ్చినానని నచ్చేలా బాది, నచ్చే ఉంతానని వూరవతల పడేసిపోయారు. నా నంతలో నచ్చేమని షిని కాను. అల్లచేత నిజం సెప్పించాల. అప్పుడు నవ్వాల. ఆడ్ని నంపాలో, వద్దో వూరే సెప్తాది. నా నింకా బతికున్నానని ఉలికులికి పడ్తన్నడు. నన్ను పట్టించి వోడికి ఏలకి ఏలిస్తానని ఆడి మనుసులికి సెప్పినాడంట. ఇప్పుడు సెప్పే— ఎవరు దొంగ? ఎవరు దొర?... ఆ రేత్రి ఈయమ్మ కూ డెట్టి నన్ను బతికించినాదే. ఆయమ్మ నా కోసరం కూడుంచుతాది. ఎళ్లే! ఎళ్లి నూడే."

పగడాలు కళ్ళు వెంట నీళ్ళు తిరిగాయి. కన్నీరు తుడుచుకుని దీపం బుడ్డి పట్టుకుని వంటింటివైపెళింది. నూకాలుఆమెననుసరించాడు. వంటింటిలో కంచం క్రింద ఆకులో ఉన్న భోజనం ఆమె కంట పడింది. ఆ ఆకు వలాగ తెచ్చి అతని ముందుంచింది. తలుపు దేరవేసి తినమంది. నూకాలు ఆబగా తినసాగాడు.

అంతలో వీధి తలుపు దగ్గర ధ్వని అయింది.

పగడాలు ఒక్క ఉదుటున ముందు గదిలోకి వెళ్ళింది. వీధి తలుపు తీసి ఉంది. వీధిలోకి వెళ్ళి చూచింది. సన్నగా కురిసే వానలో, హోరున వీచే గాలిలో ఎవరో ముందుకు పరుగెడుతున్నట్టు అయింది.

అనుమానం వచ్చి లోపలికి వచ్చి మంచం వైపు చూసింది.

మంచం మీద సారధి లేడు.

పగడాలు గుండె గుబేలుమంది.

"ఆడు... పారిపోతన్నడు." పరుగెత్తుకుంటూ వచ్చి నూకాలుతో చెప్పింది.

ముద్ద నోటిలో పెట్టుకోబోతూ—"ఆడెవడు?" అన్నాడు నూకాలు.

"సీతాపతి మడిసి—మామ్మ గారింట భోజనం చేస్తాడే—ఆడు? గాలి వానకు తల్దాసుకోనాని వచ్చిన మనిషిని నిన్న — ఆ దొంగ నచ్చినోడు— ధూ! సెడగొట్టాలని నూసిండు. నాలుగుతికినా! ఇంతసేపూ నచ్చిన పాములా తొంగుండి, ఇప్పుడు పారి పోతండు. ఆదో దుష్ట పురుగు. మన మాటలన్నీ ఇన్నాడు. ఆడు తోట వంకే ఎల్తన్నడు. ఏటి సేస్తడో, ఏటో? నీ వీడ ఉన్నట్టు సెప్తడు. నీ సేనానికి ముప్పు పారిపో—అన్నా! ఇంకెప్పుడిటు రాక నామాటిని పారిపో!" ఏడిచే కంఠంతో అంది పగడాలు.

"అందుకే నా సారధి అలా పరుగెడుతున్నాడు?"

వెను తిరిగింది పగడాలు. "మామ్మగారూ!"

"నేనంతా విన్నానే. ఈ రాత్రి వాడిని ఈ ఇంట ఉంచడమే నే చేసిన పొరపాటు. నీవు భయంతో ఎక్కడ చస్తావో అని కంగారు పడుతూనే ఉన్నాను. వెళ్ళిన పని మరోటి కాదుగా! వెళ్ళిన పని అయిన వెంటనే వచ్చాను. నూకాలూ! నీ కొచ్చిన భయమేదీ లేదు. తీరికగా భోజనం చెయ్యి. ఇక నుండి వాడికి భయపడి తిరగక్కరలేదు. నా ఇంటే ఉండు. ఒసే పగడాలూ! నీకు వచ్చిన భయమేదీ లేదు. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు. మనం భయపడి పారిపోతున్నంత కాలం ఈ మనుషులు తరిమికొడుతూనే ఉంటారు. ఒక మంచి మనిషి, ఒక ఆదరించే మనసు, ఆడదాని అసహాయత—వీళ్ళదృష్టిలో ఎప్పుడూ కొరగానివే. ఈ ఇల్లు కాలిపోయిననాడు ఈ వూరంతా శ్మశానమవుతుంది. ఈ ఇంట గుప్పెడు మెతుకులు పెట్టే దాత లేని నాడు ఈ వూరంతా కరువులో అల్లాడిపోతుంది. ఈ ఇంటిలో దీపం వెలగని నాడు ఈ వూరంతా వరదల్లో కొట్టుకుపోతుం." అంటూ నూకాలు పక్క కూలబడిం దామె.

హోరు మంటున్న గాలిలో ఉధృతమై కురిసే వానలో, సముద్రం రొదను భరిస్తూ ఆ ఇల్లు అలానే నిలిచి ఉంది.

ఆ హోరులో, ఆ వాన రొదలో సముద్రపు ఘోషలో భూమిని కబళించేటట్టు ఒక్క ధ్వని — అంతకుముందే భూమిని వెయ్యి కళ్ళతో చూచే మెరుపు.

పగడాలు—"హోలమ్మో పిడుగు!" అంటూ సీతమ్మ గారిని కౌగిలించుకుంది.

దూరాన ఒక పెద్ద ఆర్తనాదం.

సీతమ్మ గారి గుండె ఒక్కసారి కలుక్కుమంది.

"ఎవరో ఛచ్చారే, తల్లీ!" అందామె కలవరపడుతూ.

ఆ ఎవరో గురించి ఏ మాత్రం ప్రమేయం లేక గాలి హోరుమంటూనే ఉన్నది. వాన రొద చేస్తూనే ఉన్నది. సముద్రం ఘోష పెడుతూనే ఉంది. ★


**వదలకండి**

4 బ్యాండ్ల అఖిల ప్రపంచ ఏసి / బ్యాటరీ ట్రాన్సిస్టర్ అన్ని ఖర్చులు కలుపుకు రూ. 180/— లు ఖరీదు అగునది మా సహకార పద్ధతి ద్వారా రూ. 20/— లకే తెప్పించుకొనండి. ఉచిత వివరములకు స్వంత అడ్రసు వ్రాసిన 35 పైసల స్టాంపు గల కవరు పంపుము వ్రాయండి.

**KAPSONS ENTERPRISES (Regd.)**
**45, Arjun Nagar (WA) Delhi-110051.**

దీర్ఘవ్యాధులకు ఉత్తమ వైద్యం!



దురభ్యాసములకులోనై దాంపత్యసౌఖ్యంపొందలేనివారు, హెర్నియా, చర్మవ్యాధులకు పోస్టు ద్వారావరిబీజము(బుడ్డ). మూత్రవ్యాధులు, ఇస్నోఫీలియా, దమ్ము, ఉబ్బసమునకు ఆపరేషన్‌లేకుండ రండి.

డా॥ దేవర,
5/1, బ్రాడీపేట, గుంటూరు-2
బ్రాంచీలు: 26, నార్త్‌బోగ్‌రోడ్, మద్రాసు-17. మార్కండేయగుడివద్ద, తెనాలి. ఫోన్ 551

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేచనముతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరములేదు!

**తెల్ల జుట్టును**
**అంతమొందించండి**

జుట్టు రంగుతో కాదు. మా సువాసన ఆయుర్వేద పుష్పమాల తలనూనె తెల్ల జుట్టు సహజమైన నలుపు రంగుకు శాశ్వతంగా మారుతుంది. ఇది కళ్ళకు, మెదడుకు వరప్రసాదం. వెల — 1 బుడ్డి రూ. 12/— లు. 3 బుడ్లు రు. 30/— లు. పోస్టేజి అదనం.

**Gautam Chikitsalaya (O.T.)**
P.O. Katri Sarai (Gaya)